మాదకద్రవ్యాల నష్టాన్ని ప్రజలకు వివరించాలి

– ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం జయరాజ్

కడప ఎడ్యుకేషన్: మాదకద్రవ్యాల వల్ల జరిగే నష్టాన్ని తెలుసుకొని దూరంగా ఉంటూ తమ చుట్టూ ఉన్న సమాజాన్ని చైతన్యం చేయాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం జయరాజ్ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. వైవీయు ఎన్ఎస్ఎస్, ఓబిసి, యాంటీ డ్రగ్ సెల్ ఎక్సైజ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం, ర్యాలీ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని కుటుంబాలు , సమాజం సమస్యల్లో కూరుకుపోతుందన్నారు. డ్రగ్స్ వంటి నిషేధిత పదార్థాలు జోలికి యువత వెళ్లవద్దని సూచించారు. మత్తు పదార్థాలు వినియోగించిన, సరఫరా చేసిన, సహకరించిన వారిపై కఠినమైన చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎస్ రవికుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించడం ద్వారా ‘తక్కువ ఆనందం శాశ్వత దుఃఖం’ మిగులుతుందన్నారు. ఒకసారి అలవాటయితే జీవితం ముగిసినట్లేనని పలు ఉదాహరణలతో వివరించారు. సమాజాన్ని యువత చైతన్యం చేయాలని కోరారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. వినోద్ కుమార్ మాట్లాడుతూ నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారం డ్రగ్స్ బారినపడి ప్రతి గంటకు ఒకరు మృతి చెందుతున్నారని తెలిపారు. అనధికారికంగా ఈ సంఖ్య పది నుంచి 20 వరకు ఉండవచ్చన్నారు. ప్రమాద తీవ్రతను గుర్తు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి. కృష్ణ కుమార్ మాట్లాడుతూ యువత ప్రయోజకులైతే దేశం అగ్రగామిగా నిలుస్తుందని గుర్తు చేస్తూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. వైవీయు ఎన్ ఎస్ ఎస్ సెల్ సమన్వయకర్త డాక్టర్ ఎన్ వెంకట్రామిరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించగా ఓబీసీ సెల్ డైరెక్టర్ ఆచార్య కె ఎస్ వి కృష్ణారావు సదస్సు ఉద్దేశాన్ని వివరించారు. వైవీయు యాంటీ డ్రగ్ సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ శ్రీనివాస్ గౌడ్, ఆచార్య జి పార్వతి మాట్లాడుతూ యువత చైతన్యవంతులు కావాలని కోరారు. ఈ సందర్భంగా ‘యాంటి డ్రగ్ అండ్ డ్రగ్ అబ్యూస్’ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల అవగాహనపై ఓబీసీ సెల్ రూపొందించిన పోస్టర్లను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం ప్లకార్డులతో విశ్వవిద్యాలయంలో ర్యాలీ నిర్వహించి డ్రగ్ రహిత రాష్ట్రాన్ని, దేశాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ కే నరసింహులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ నవ సమాజ స్థాపనకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ పిలుపునిచ్చారు. గురువారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. కడప నగరంలోని మరియాపురంలోగల న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపులో ఆయన మాట్లాడుతూ నల్సా పథకం -2015ను వివరించారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు రిజిస్టర్ మెడికల్ వైద్యాధికారి దగ్గరికి వెళ్లాలని, డ్రగ్స్ మోతాదుకు మించి వాడడం హానికరమన్నారు. ఆర్టికల్ 47, ద డ్రగ్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్ స్టాన్సిస్ యాక్ట్ 1985 తదితర అంశాలను ఆయన వివరించారు. విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, డిస్టిక్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, వన్ స్టాప్ సెంటర్, వైద్య ఆరోగ్యశాఖ, దిశా పోలీస్, కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా అధికారులు, లెక్చరర్లు, ఎన్జీవోలు, విద్యార్థులు సందర్శించారు. అనంతరం చేపట్టిన ర్యాలీ సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల నుండి మెయిన్ రోడ్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిస్టిక్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవిబాబు, ఇంటర్మీడియట్ బోర్డ్ రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ బి వెంకటసుబ్బయ్య, కడప దిశా పోలీస్ స్టేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బాలస్వామి రెడ్డి, డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్, డిస్టిక్ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ భాస్కర్, డిస్టిక్ జైలు ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్ యాదవ్, సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసమూర్తి, కరస్పాండెంట్ రవిచంద్రన్, డిస్టిక్ ప్రొబేషన్ ఆఫీసర్ రవి ప్రకాష్, వన్ స్టాప్ సెంటర్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

అవగాహన ర్యాలీ

కడప ఎడ్యుకేషన్: జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా గురువారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఎన్.సి.సి క్యాడెట్లు, విద్యార్థులు, అధ్యాపకులు అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ ర్యాలీ కళాశాల నుండి ప్రారంభమై కడప ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ముఖ్యమంత్రి కడపలో జరిగిన మహానాడు వేదికగా పది రోజులలో ఉక్కు పరిశ్రమ పనులు మొదలు పెడతామని చెప్పిన హామీ ఏమైందని, వెంటనే పనులు ప్రారంభించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అన్నారు. గురువారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప ప్రజలకు మహానాడు వేదికగా ఉక్కు పై ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీల మాటలు కాకుండా కేంద్రాన్ని నిలదీసి కడప ఉక్కు నిధులు రాబట్టాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు పాల్గొన్నారు.

అనుమతిలేని ప్లే స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: కడప మండల పరిధిలో అనుమతిలేని ప్రైవేట్ ప్లే స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రెవల్యూషనరీ యూత్ ఫ్రంట్ సంఘాలు డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం ఎంఈఓ గంగిరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి యువజన సంఘం నాయకులు సుబ్బరాయుడు, భరత్ మాట్లాడుతూ ఎసీఈఆర్టీ వంటి ప్రభుత్వ ఆమోదిత పుస్తకాలను ఉపయోగించాలని నిబంధనలు ఉన్నా వాటిని పాటించకుండా, సిబిఎస్ఈ, ఐబిటీ, ఇంటర్నేషనల్ , మోడల్ స్కూల్ వంటి వివిధ కరికులం పేర్లతో ప్రైవేటు ప్రచురణల పుస్తకాలను విద్యార్థులకు తప్పనిసరిగా కొనుగోలు చేయమని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. పుస్తకాలు అధిక ధరలకు అమ్ముకుంటున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యు జిల్లా కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

‘బాలకొండ’కు డాక్టరేట్


బాలకొండ గంగాధర్‌ను సత్కరిస్తున్న అంబేడ్కర్ వర్సిటీ వీసీ తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : చరిత్రకారుడు, ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు బాలకొండ గంగాధర్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆ విశ్వవిద్యాలయ చరిత్రశాఖ సీనియర్ ఆచార్యులు డాక్టర్ ఇ.సుధారాణి పర్యవేక్షణలో గంగాధర్ 2022 నుంచి ‘రాష్ట్రపతి భవన్‌కు ఆంధ్ర ప్రముఖులు–విమర్శనాత్మక అధ్యయనం’పై పరిశోధన నిర్వహించారు. ఆంధ్ర ప్రాంతం నుంచి సర్వేపల్లి రాధాకృష్ణన్, వీవీ గిరి, సంజీవరెడ్డి రాష్ట్రపతులుగా పోషించిన విలక్షణ పాత్రపై ఆయన పరిశోధన సాగింది. ఆయా రాష్ట్రపతుల కాలాల్లో జరిగిన సంఘటనలు, ఎదుర్కొన్న ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారాలపై విమర్శనాత్మక పరిశోధన నిర్వహించారు. ఇందుకు ఆయనకు అంబేడ్కర్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆ వర్సిటీ ఉప కులపతి ఆచార్య ఘంటా చక్రపాణి రీసెర్చ్ సూపర్‌వైజర్ సుధారాణి, ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర సీనియర్ ఆచార్యులు డాక్టర్ అంజయ్య తదితరులు పీహెచ్‌డీ పొందిన గంగాధర్‌ను సత్కరించారు.

చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని బీజేపీ వైఎస్సార్ కడపజిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 1975లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నాయకులను జైలులో బంధించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత నేత రాహుల్‌గాంధీ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మారుస్తుందని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశంలో 11 ఏళ్లుగా అప్రకటిత అత్యవసర పరిస్థితి ఏర్పడిందని డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల ఓట్లతో ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాలను ధనం, బలంతో కూల్చడంలో బీజేపీ సిద్ధహస్తులుగా మారారన్నారు. పార్లమెంట్ అనే ప్రజాస్వామ్య దేవాలయాన్ని, చర్చలతో కాకుండా బిల్లులను బుల్డోజర్‌తో ఆమోదించే స్థితికి తీసుకువచ్చారన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

సిద్దవటం : సిద్దవటం పరకోటలోని సయ్యద్‌షా బిస్మిల్లా షా ఖాద్రీ దర్గాను హజరత్ మెహబూబ్ – ఎ– సుభానీ ముని మనవడు సయ్యద్ బషీర్ హుస్సేన్ బాగ్దాదీ కమలాపురం పీఠాధిపతి కుమారుడు సయ్యద్ జియావుల్ హక్‌తో కలిసి గురువారం సందర్శించినట్లు దర్గా పీఠాధిపతి ముగ్దూమ్ పీర్ ఖాద్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెహబూబ్ – ఎ – సుభానీ వంశం 24వ తరానికి చెందిన సయ్యద్ బషీర్ హుస్సేన్ బాగ్దాదీ అని అన్నారు. ఆయన సయ్యద్‌షా బిస్మిల్లా షా ఖాద్రీ దర్గాలో ఫాతేహా నిర్వహించారన్నారు. మెహబూబ్–ఎ–సుభానీ అంటే దేవుని ప్రియుడు అని అర్థమని మెహబూబ్ – ఎ – సుభానీ లేదా అబ్దుల్ ఖాదిర్ జిలానీ 1077 – 1166 మధ్య జీవించారన్నారు. ఆయన బాగ్దాద్‌లో గొప్ప సూఫీ గురువుగా ప్రసిద్ధి చెందారని ఆయన అన్నారు. (

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : కడప రిమ్స్‌లో ఇటీవల తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, హాస్పిటల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రాఘవ డిమాండ్ చేశారు. జిల్లా ఆస్పత్రి ఆవరణలో గురువారం శానిటేషన్ కార్మికులతో కలిసి వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇటీవల కారణం లేకుండానే కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డి రిమ్స్‌లో పని చేస్తున్న కార్మికులను తొలగించారని, వీరిని తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళ్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు రత్నమ్మ, ప్రధాన కార్యదర్శి గంగాధర్, కోశాధికారి మహేష్, కమిటీ సభ్యులు మల్లికార్జున, నరసింహులు, ప్రసాదు, రాణి, మల్లమ్మ పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో మలేరియా నివారణ

చాపాడు : దోమల వ్యాప్తి జరగకుండా, వాటిని నిర్మూలించడం వల్ల మలేరియాను నివారించవచ్చని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ‘దోమ పుట్టకూడదు–దోమ కుట్టకూడదు’ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికున్ గున్యా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మలేరియా మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల వ్యాప్తి జరుగకుండా గ్రామాల్లోని మురికి కాలువలు, కుంటలలో ఆయిల్ బాల్స్ చల్లాలని సూచించారు. దోమల కుట్టకుండా ప్రజలు దోమ తెరలు వాడాలని పేర్కొన్నారు. అనంతరం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, సీహెచ్ఓ మహదేవ్ యాదవ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, పీహెచ్ఎన్ సుకన్య, ఎంపీహెచ్ఈఓ రాఘవయ్య, సూపర్‌వైజర్లు బాబురెడ్డి, ప్రసాద్, లావణ్య, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూములు ఆక్రమిస్తే చర్యలు

బద్వేలు : బద్వేలు మున్సిపాలిటీలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. పట్టణ పరిధిలోని కమ్మలమ్మ కాలనీ సమీపంలో అంబేడ్కర్ భవన్ దగ్గర చెన్నంపల్లె పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 1773లో 0.15 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించారు. స్థానికులు బుధవారం దురాక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌డీఓకు వినతి పత్రం అందించారు. గురువారం ఉదయం అక్రమ కట్టడాలను పరిశీలించిన ఆర్‌డీఓ చంద్రమోహన్ వాటిని కూల్చి వేయాల్సిందిగా తహసీల్దారు ఉదయ భాస్కర్‌రాజును ఆదేశించారు.

‘బ్రౌన్’ నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయ అనుబంధ సంస్థ సి.పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు గురువారం సాయంత్రం పరిశీలించారు. కడప ఎర్రముక్కపల్లెలోని సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం వెనక భాగంలో రూ.3.6 కోట్లతో నూతన భవన నిర్మాణ పునాది పనులు మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఉపకులపతి శ్రీనివాసరావు ఏపీ ఈడబ్ల్యూ ఐడిసి ఇంజనీర్ గురివిరెడ్డి తో మాట్లాడుతూ పనులు ఏడాదిలోపు పూర్తి కావాలనే లక్ష్యంతో నాణ్యతకు పెద్దపీట వేస్తూ పనులను పూర్తి చేయా లని కోరారు.

నిర్మాణ పనులకు సంబంధించి కమిటీని వేయాలని ఈ సందర్భంగా సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ వీసీ దృష్టికి తెచ్చారు. వీసీ వెంట విశ్వవిద్యాలయ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ, సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి ఉన్నారు.


బ్రౌన్ గ్రంథాలయ పనులను పరిశీలిస్తున్న వీసీ శ్రీనివాసరావు

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరం ఎర్రముక్కపల్లి– భాకరాపేట వద్ద ఉన్న అండర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఎర్రముక్కపల్లె వైపు పూర్తి కావచ్చాయని, కానీ అంగడి వీధి వైపు పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. భూసేకరణ, పరిహారం, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో కార్పొరేషన్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. రెవెన్యూ, రైల్వే, కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థలాల సేకరణ ఇంకా జరగలేదన్నారు. తక్షణమే స్థల సేకరణ పూర్తి చేసి పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, పార్టీ నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కుమారస్వామి రెడ్డి, గోవిందు, నరసింహ, తిమ్మయ్య , లెనిన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

దేవుని కడపలో నీటి ఎద్దడి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని దేవునికడప పరిధిలోని పద్మావతి వెంచర్స్ బండారు నగర్‌లో పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్నారు. దీంతో పదిరోజులుగా నీళ్లు రాక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన ఫిట్టర్ సుబ్బయ్య, వాటర్‌మెన్ రామచంద్రయ్యలు ప్రతి ఇంటికీ రూ.500 చొప్పున డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, లేకపోతే నీళ్లు రావని చెబుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగునీరు సరఫరా కావడం లేదని, తగు చర్యలు తీసుకోవాలని నగరపాలక అధికారులకు ఎన్ని సార్లు ఫోన్లు చేసినా స్పందించడం లేదంటున్నారు. నిజాయితీగా కొళాయి కనెక్షన్లు తీసుకొని పన్నులు కడుతున్న ఇండ్లకు కూడా తాగునీరు సరఫరా కాకుండా నిలిపివేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ కొళాయి కనెక్షన్లపై చూసీ చూడనట్లు వ్యవహరించే నగరపాలక సిబ్బంది...కార్పొరేషన్‌కు డబ్బు కట్టి నెలనెలా నీటి పన్ను కడుతున్న ప్రజలను ఇబ్బందులు పెట్టడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు దీనిపై దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


బండారు నగర్‌లో పెద్ద పైపులైన్‌కు ఉన్న కొళాయి కనెక్షన్లు

రక్తదానం చేయడం సామాజిక బాధ్యత

కడప కార్పొరేషన్: రక్తదానం చేయడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ కె. సురేష్ బాబు తెలిపారు. గురువారం ఎర్రముక్కపల్లెలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వారు ప్రారంభించి, నాగేంద్రతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాన శిబిరానికి యువకులు పెద్ద ఎత్తున హాజరై రక్తదానం చేయగా, జన్మదినం జరుపుకుంటున్న గుంటి నాగేంద్ర కూడా రక్తదానం చేశారు. ఆ తర్వాత భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, పి. జయచంద్రారెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి, ఐస్‌క్రీం రవి, రామక్రిష్ణారెడ్డి, షఫీ, కె. బాబు, దేవిరెడ్డి ఆదిత్య, కంచుపాటి బాబు, లక్ష్మయ్య, సీహెచ్ వినోద్ పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర తదితరులు

మహిళా సాధికారతతో సుపరిపాలన సాధ్యం

ప్రొద్దుటూరు రూరల్ : మహిళా సాధికారతతోనే సుపరిపాలన సాధ్యమని జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో గురువారం మహిళా సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించి వారి సాధికారతతో సుపరిపాలన అందించాలన్నారు. మహిళా నాయకత్వంలో మార్పు రావాలన్నారు. నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు ఈ శిక్షణా తరగతులు దోహదపడుతాయన్నారు. మహిళా సర్పంచ్‌లు తమకున్న సమస్యలపై చర్చించి వాటిని ఏవిధంగా పరిష్కరించాలో ఈ శిక్షణా తరగతుల ద్వారా అవగాహన పెంచుకోవాలన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్రహ్మణ్యం

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, ప్రొద్దుటూరు, చాపాడు, దువ్వూరు, జమ్మలమడుగు, కొండాపురం మండలాల మహిళా సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం


మారుతీ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కడప కార్పొరేషన్: కడప నగరం 20వ డివిజన్ పరిధిలోని మారుతీనగర్ పాత ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఎదురుగా ఉన్న వీధిలో సీసీ రోడ్డు, కాలువలు నిర్మించాలని స్థానిక ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. నగరపాలక సంస్థ మేయర్ కె. సురేష్ బాబు ఆధ్వర్యంలో పాలకవర్గం ఈ రోడ్డును మంజూరు చేయగా నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం వల్ల టెండర్లు రద్దు చేశారు. ఇలా రెండు సార్లు రద్దు కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక కార్పొరేటర్ వై. మాధవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్‌కు పలుసార్లు వినతి పత్రాలు సమర్పించారు. ఈ విషయంపై ‘సాక్షి’ కథనం కూడా ప్రచురించింది. ఆ తర్వాత ఆ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కార్పొరేటర్ వై. మాధవి హర్షం వ్యక్తం చేస్తూ మేయర్ సురేష్‌బాబుకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

5న ఆలయ భూమి వేలం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో జూలై 5న శనివారం ఉదయం 10.30 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పాగులో ఉన్న సర్వే నంబర్ 152/బీలోని 10.06 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించి మూడేళ్ల కాల పరిమితికి గుత్తకు వేలం పాట నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.5 వేల డిపాజిట్ చెల్లించాలని సూచించారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు ఒక సంవత్సరం గుత్త చెల్లించాలని తెలిపారు.

మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సి.రవిచంద్రారెడ్డికి గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పట్టణ కార్యదర్శి బి.మధు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కేంద్ర జాతీయ కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో జూలై 9వ తేదీన సమ్మెలో కార్మికులు పాల్గొంటున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 44 లేబర్ కోడ్‌లను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాసిందని విమర్శించారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా పెండింగ్‌లో ఉన్న బకాయిలను ఇంత వరకు విడుదల చేయలేదన్నారు. మూడేళ్ల సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఎప్పుడు విడదల చేస్తారో తెలియక కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. రెండేళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనె, కుట్టుకూళ్లు వెంటనే ఇవ్వాలన్నారు. డైలీ వేజ్ కార్మికులకు నూతన లేబర్ చట్టం ప్రకారం రూ.570 ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటలక్షుమ్మ, గురుమూర్తి, వీరమ్మ, ప్రమీల రాణి, సురేష్, రాజేష్, ప్రభాకర్, నాగేంద్ర, సాగర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


మస్తాన్ బీని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హుస్సేన్ భార్య మాజీ సర్పంచ్ మస్తాన్‌బీని గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. మస్తాన్ బీ అనారోగ్యానికి గురై అనుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశాంత్రి తీసుకుంటుంది. కార్యక్రమంలో సర్పంచ్ నాగార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.